- వడ్లు కొనడం లేదంటూ రైతుల నిరసనలు
- మొన్న ఎత్తొండ.. నిన్న బైరాపూర్ సొసైటీలకు తాళాలు
- పోతంగల్ సొసైటీ ఎదుట కర్షకుల ఆందోళన
- అకాల వర్షాలతో ఆందోళనలో రైతాంగం
- కాంటాలు వేగవంతం చేయాలని డిమాండ్



శనివారం బీర్కూర్ మండలం బైరాపూర్ ప్రాథమిక సహకార సంఘ కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలుపుతున్న మల్లాపూర్ రైతులు

కాంటా వేయడం లేదని నిరసిస్తూ మొన్న ఎత్తొండ సొసైటీ ఎదుట రైతులు ఆందోళనకు దిగారు. సొసైటీకి గేటుకు తాళం వేసి నిరసన చేపట్టారు.

వడ్ల కొనుగోళ్లలో పక్షపాతం చూపిస్తున్నారంటూ లింగాపూర్, గన్నారం గ్రామాలకు చెందిన రైతులు ఇటీవల కొత్తపల్లి సొసైటీ ఎదుట ఆందోళనకు దిగారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ శనివారం బైరాపూర్ సొసైటీకి తాళం వేశారు.

గన్నీ బ్యాగులు ఇవ్వకుండా వేధిస్తున్నారని అన్నదాతలు పోతంగల్ సొసైటీ ఎదుట శనివారం ఆందోళన నిర్వహించారు.

## కొనుగోళ్లలో జాప్యం

# అన్నదాతల ఆగ్రహం

**వడ్ల కొనుగోళ్లలో** తీవ్ర జాప్యం జరుగుతున్నది. అకాల వర్షాలు వెంటాడుతున్న వేళ.. కాంటాల్లో జరుగుతున్న తాత్సారం రైతాంగాన్ని ఆందోళనకు గురి చేస్తున్నది. ప్రభుత్వ యంత్రాంగంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు పలుచోట్ల నిరసనలకు దిగుతున్నారు. సొసైటీలకు తాళాలు వేసి, సిబ్బంది తీరుపై రుసరుసలాడుతున్నారు. వడగండ్ల ముప్పు పొంచి ఉన్న తరుణంలో కాంటాల్లో జాప్యం చేయడమేమిటని నిలదీస్తున్నారు. కేసీఆర్ సారు ఉన్నప్పుడే మంచిగుండెనని, పంట కోయగానే తూకం వేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూశారని గుర్తు చేసుకుంటున్నారు.



శనివారం పోతంగల్ సహకార సంఘం ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

నస్రుల్లాబాద్/పోతంగల్, ఏప్రిల్ 19: ఉమ్మడి జిల్లా రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న తాత్సారంతో ఆవేదన చెందుతున్నారు. అకాల వర్షాలు కురుస్తుండడంతో చేతికొచ్చిన పంట చేజారిపోతుందన్న భయం అన్నదాతల్లో నెలకొంది. ఈ నేపథ్యంలో కడుపు మండిన రైతులు ఎక్కడికక్కడ ఆందోళనలకు దిగుతున్నారు. సొసైటీలకు తాళాలు వేస్తూ ప్రభుత్వ యంత్రాంగ తీరును ప్రశ్నిస్తున్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఇటీవల కురిసిన వర్షాలతో.. ఆరబోసిన ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. వాటిని మళ్లీ ఆరబెట్టడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాంటి పరిస్థితి తమకు రావొద్దని మిగతా కర్షకులు కోరుకుంటున్నారు. వెంటనే కాంటాల్లో వేగం పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.

### బ్యాగులు ఇవ్వడం లేదని..

కొన్ని సొసైటీల్లో పక్షపాతం చూపిస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. కావాల్సిన వారికే సంచులు ఇస్తున్నారని, మిగతా ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తే ఇటీవల కొత్తపల్లి సొసైటీ ఎదుట లింగాపూర్, గన్నారం గ్రామాల రైతులు ఆందోళన నిర్వహించారు. తాజాగా పోతంగల్ ప్రాథమిక సహకార సంఘం ఎదుట అన్నదాతలు శనివారం నిరసనకు దిగారు. సొసైటీ సిబ్బంది కనీసం పట్టించుకోవడం లేదని, ఫోన్ చేసినా సమాధానం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హమాలీల కొరతతో కాంటాలు వేయడం లేదని, గన్నీ బ్యాగులు కూడా ఇవ్వడం లేదని అన్నదాతలు మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో సమస్యల గురించి ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పంట కోసి 15 రోజులవుతున్నా కాంటాలు వేయకపోతే ఎలా..? వర్షాలు ఉన్నాయని చెబుతున్నారు. ఎండిన ధాన్యం తడిసిపోతే ఎవరు బాధ్యులని రైతులు ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోళ్లు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.

### కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండే..

బీఆర్ఎస్ పాలనలో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా వడ్లు అమ్ముకున్నామని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. 'కేసీఆర్ సారు ఉన్నప్పుడే మంచిగుండె. ఊరూరా కొనుగోలు కేంద్రాలు పెట్టింద్రు. పంట కోసిన వెంటనే కాంటాలు వేసింద్రు. వెంటవెంటనే డబ్బులు ఖాతాల్లో జమ చేసింద్రని' రైతులు చెబుతున్నారు. కాంగ్రెస్ వచ్చాక తమ బతుకులు ఆగమయ్యాయని ఆవేదన చెందుతున్నారు. 'రుణమాఫీ ఇయ్యకుండా, రైతుబంధు డబ్బులు వెయ్యకుండా మోసం చేసింద్రు. ఇప్పుడు వడ్లు కొనకుండా సతాయిస్తున్నారని' వాపోతున్నారు.



### ఇదేం పక్షపాతం..?

సొసైటీ సిబ్బంది వాళ్లకి ఇష్టం వచ్చినోళ్లకే సంచులు ఇస్తున్నారు. చిన్న రైతు, పెద్ద రైతు అని తేడా చూపిస్తుండ్రు. ఇదేం పక్షపాతమేమో అర్థమైతలేదు. రైతుల పట్ల ఎటువంటి తేడా చూపకుండా సీరియల్ ప్రకారమే కాంటాలు వేయాలి. గన్నీ సంచుల కొరత లేకుండా చూసి, కొనుగోళ్లు వేగవంతం చేయాలి.

- అశోక్, రైతు, పోతంగల్

### సొసైటీలకు తాళం..

ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ బీర్కూర్ మండలం బైరాపూర్ ప్రాథమిక సహకార సంఘానికి మల్లాపూర్ గ్రామ రైతులు శనివారం తాళం వేశారు. వడ్లు కొనడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ సొసైటీ ఎదుట నిరసన తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి త్వరగా కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. మరోవైపు, కాంటా వేయడం లేదని నిరసిస్తూ మొన్న ఎత్తొండ సొసైటీకి కూడా రైతులు తాళం వేసి నిరసన చేపట్టారు.



ఇటీవల ఎత్తొండ సహకార సంఘం గేటుకు తాళం వేసిన రైతులు



తనను కలిసేందుకు వచ్చిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న బోధన్ మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్

# నేడు బోధన్‌లో బీఆర్ఎస్ సన్నాహక సమావేశం

## విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే షకీల్ పిలుపు

బోధన్, ఏప్రిల్ 19: తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షతో బీఆర్ఎస్ పార్టీని కేసీఆర్ స్థాపించి 25 ఏండ్లు పూర్తవుతున్న సందర్భంగా వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27వ నిర్వహించనున్న రజతోత్సవ సభను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని బోధన్ మాజీ శాసనసభ్యుడు మహ్మద్ షకీల్ అన్నారు. బోధన్ పట్టణంలోని తన స్వగృహంలో ఆయనను కలిసేందుకు శనివారం పెద్ద సంఖ్యలో వచ్చిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి షకీల్ మాట్లాడారు. రజతోత్సవ వేడుకల నేపథ్యంలో బోధన్ నియోజకవర్గం సన్నాహక సమావేశాన్ని నేడు(ఆదివారం) నిర్వహించనున్నట్లు తెలిపారు. బోధన్ పట్టణంలోని ఆఫ్నా ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సన్నాహక సమావేశానికి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని షకీల్ సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, బీఆర్ఎస్ బోధన్ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్, పార్టీ వివిధ మండలాల అధ్యక్షులు సంజీవ్‌కుమార్, గోగినేని నర్సయ్య, డి.శ్రీరామ్, భూమ్‌రెడ్డి, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభను ఈనెల 27వ వరంగల్ జిల్లాలో నిర్వహించనున్నారు. సభ విజయవంతం చేయడం కోసం బీఆర్ఎస్ శ్రేణులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా వాల్ పెయింటింగ్స్, పోస్టర్ల ఆవిష్కరణతోపాటు సన్నాహక సమావేశాలను నిర్వహిస్తున్నారు.

-ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 19



బీఆర్ఎస్ రజతోత్సవ సభ పోస్టర్లను ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఫాంహౌస్‌లో విడుదల చేస్తున్న నాయకులు

- రెవెన్యూ వర్గాల్లో కలవరం
- 'నమస్తే తెలంగాణ' ఎఫెక్ట్

## కలెక్టర్ దృష్టికి ఖండ్‌గావ్

# ఇసుక వ్యవహారం




బోధన్, ఏప్రిల్ 19: బోధన్ మండలంలోని మంజీర నదిలో నిర్వహిస్తున్న ఖండ్‌గావ్ ఇసుక క్వారీలో జరుగుతున్న అక్రమాలపై 'మంజీరను తోడేస్తున్నారు' శీర్షికతో 'నమస్తే తెలంగాణ' దిన పత్రికలో శనివారం ప్రచురితమైన కథనం రెవెన్యూ వర్గాల్లో కలవరం సృష్టించింది. ప్రభుత్వ సెలవు రోజున నిబంధనలకు విరుద్ధంగా ఆ క్వారీలో ఇసుక తవ్వకాలు జరుగుతుండడం, అందులోనూ నదీ గర్భంలో జేసీబీతో ఇసుక తోడడాన్ని నమస్తే వెలుగులోకి తీసుకువచ్చింది. దీంతో ఖండ్‌గావ్ క్వారీ వ్యవహారం ఇటు రెవెన్యూ వర్గాలతోపాటు రాజకీయ వర్గాల్లోనూ చర్చనీయాంశమైంది. కాగా, ఖండ్‌గావ్ ఇసుక వ్యవహారం, నమస్తే తెలంగాణ కథనాన్ని స్థానిక రెవెన్యూ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. రెవెన్యూ ఉన్నతాధికారులు ఖండ్‌గావ్ ఇసుక క్వారీ వ్యవహారాలపై ఉదాసీనంగా ఉంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

# నీటి కటకట


- అవసరాలు తీర్చుకునేందుకు పట్టణవాసుల అవస్థలు
- అధికారులు సమీక్షించినా.. లభించని పరిష్కారం
- పోటీపడి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నరాజకీయ నాయకులు

## కామారెడ్డిలో తీవ్ర నీటి ఎద్దడి

ఎండలు ముదరడం తోనే కామారెడ్డి పట్టణంలో నీటి కష్టాలు మొదలయ్యాయి. పట్టణంలోని పలు కాలనీలకు మిషన్ భగీరథ నీళ్లు సరిగా సరఫరా కావడం లేదు. మరోవైపు భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో బోరు బావుల్లో నుంచి కూడా నీరు రావడం లేదు. దీంతో ఆయా కాలనీల వాసులు ఉదయం నుంచి నీటి కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు మున్సిపాలిటీ పాలకవర్గ పదవీకాలం ముగియడంతో.. రానున్న ఎన్నికల కోసం పలువురు రాజకీయ నాయకులు నీటి ఎద్దడిని తీర్చే పనిని ఎన్నికల అస్త్రంగా మార్చుకుంటున్నారు. పోటాపోటీగా ట్యాంకర్లను ఏర్పాటుచేసి కాలనీవాసుల నీటి కష్టాలు తీర్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

-కామారెడ్డి, ఏప్రిల్ 19

**జిల్లా కేంద్రంలోని** పలు కాలనీల్లో ఎండకాలం ఆరంభం నుంచే నీటి ఎద్దడి ప్రారంభమైంది. అశోక్‌నగర్, భవనీనగర్, పీఎంహెచ్ కాలనీ, కొత్త సాయిబాబా గుడి రోడ్డు తదితర కాలనీల్లో నీటి సమస్య తలెత్తింది. మిషన్ భగీరథ నీళ్లు సరిగా సరఫరా కావడం లేదు. వచ్చే కొద్ది పాటి నీళ్లు ప్రజల అవసరాలు తీర్చడం లేదు. దీంతో నీటి కోసం అనేక కష్టాలు పడక తప్పడం లేదు. పాలకవర్గ పదవీ కాలం ముగియడంతో తమ సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. అధికారులకు విన్నవించినా.. ఫలితం లేకుండా పోతున్నదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే పలువురు అధికారులు, కలెక్టర్ నీటి ఎద్దడిపై సమీక్షలు నిర్వహించారు. అయినా సమస్య మాత్రం ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉన్నది. ఇటీవల వరంగల్ నుంచి ప్రాంతీయ సంచాలకుడు షాహెద్ మసూద్ అలీ జిల్లాలోని మున్సిపాలిటీల్లో నీటి ఎద్దడిపై బల్దియా అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో పట్టణంలో నీటిని సరఫరా చేయడానికి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ కొత్తగా పది ట్యాంకర్లను ఇటీవల ప్రారంభించారు. వాటి ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. మరోవైపు బల్దియా ఎన్నికలు త్వరలో నిర్వహించనున్న నేపథ్యంలో స్థానిక నాయకులు నీటి సమస్యను తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఎన్నికల బరిలో నిలువాలని భావిస్తున్న పలువురు నాయకులు.. తమ కాలనీ ప్రజల నీటి అవసరాలు తీర్చేందుకు ట్యాంకర్లను ఏర్పాటుచేస్తున్నారు. వాటి ద్వారా పోటీ పడి మరీ నీటిని సరఫరా చేస్తున్నారు. కాలనీవాసులు తమ ఇండ్ల ఎదుట డ్రమ్ములను ఏర్పాటు చేసుకొని, నీటిని వినియోగించుకుంటున్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఎప్పుడూ నీటి సమస్య తలెత్తలేదని పట్టణ ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు. ప్రతి రోజూ మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యేదని అంటున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతోపాటు కామారెడ్డి మున్సిపాలిటీ పాలకవర్గం మారడంతో నీటి కష్టాలు ప్రారంభమయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.



ట్యాంకర్‌తో నీటి సరఫరా ఇలా..

అశోక్‌నగర్‌లో ఇదీ పరిస్థితి..

# డంపింగ్‌యార్డులో మంటలు

- అధిక ఉష్ణోగ్రతతో చెలరేగిన అగ్ని
- పది గంటలు శ్రమించి మంటలు ఆర్పిన ఫైర్ సిబ్బంది



అగ్ని ప్రమాదాన్ని పరిశీలించి, కమిషనర్ వెంకటనారాయణను అడిగి వివరాలు తెలుసుకుంటున్న బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో

శక్కర్‌నగర్, ఏప్రిల్ 19: అత్యధిక ఉష్ణోగ్రత నమోదు కావడంతో డంపింగ్ యార్డులు మంటలో చెలరేగిన ఘటన బోధన్ పట్టణ శివారులో శనివారం చోటుచేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణ శివారులోని పాండుఫారంలో సుమారు 22 ఎకరాల స్థలంలో డంపింగ్ యార్డు ఉండగా.. పది ఎకరాల్లో చెత్తను వేస్తున్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కావడంతో శనివారం చెత్తకు నిప్పంటుకున్నది. గమనించిన స్థానికులు మున్సిపల్ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే మున్సిపల్ కమిషనర్ జేసీబీ, ట్రాక్టర్లను తెప్పించి, చెత్తను వేరు చేయించారు. సమాచారం అందుకున్న ఫైర్ స్టేషన్ అధికారి శ్రీనివాస్, తమ సిబ్బందితో అక్కడికి చేరుకొని సుమారు పది గంటలపాటు శ్రమించి, మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో డంపింగ్ యార్డును సందర్శించి.. బల్దియా కమిషనర్ వెంకటనారాయణతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. డంపింగ్ యార్డులోని ఓ పక్క చెత్తకు మాత్రమే నిప్పు అంటుకున్నది. అధికారులు అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. డంపింగ్ యార్డులు పలు విలువైన మిషన్లు ఉన్నాయి.

# తాడ్వాయి ఎస్సై సస్పెన్షన్

- విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో..
- ఉత్తర్వులు జారీచేసిన మల్టీజోన్-1 ఐజీపీ

లింగంపేట(తాడ్వాయి), ఏప్రిల్19: తాడ్వాయి ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లును సస్పెండ్ చేస్తూ మల్టీజోన్-1 ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రజలకు అందుబాటులో ఉండకుండా, అనధికారికంగా విధులకు గైర్హాజరు కావడంతోపాటు విధుల్లో నిర్లక్ష్యం వహించడం, ప్రజా సమస్యలపై అలసత్వం వహించినట్లు ఆరోపణలు ఉన్నాయి. కామారెడ్డి ఎస్పీ రాజేశ్ చంద్ర ఇటీవల పోలీస్ స్టేషన్ సందర్శించిన సమయంలో ఎస్సై అందుబాటులో లేరు. ఎస్పీ అందజేసిన నివేదిక ఆధారంగా ఎస్సైపై సస్పెన్షన్ వేటు వేస్తూ ఐజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. సివిల్ తగదాల్లో జోక్యం చేసుకున్న ఆరోపణలతో సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. ఆయన తాడ్వాయి ఎస్సైగా 18నెలలపాటు విధులు నిర్వహించారు. కాగా.. తాడ్వాయి ఎస్సైగా వీఆర్‌లో ఉన్న రాజయ్యకు బాధ్యతలు అప్పగిస్తూ ఐజీపీ ఉత్తర్వులు జారీ చేయగా.. ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు.



ఎస్సై వెంకటేశ్వర్లు.